


# వంకర గీతలు

చంద్రం స్కూలునుంచి వస్తూనే రుసరుసలాడుతూ వచ్చాడు. వాకిట్లో భార్య - శాంత కన్పిస్తే చూడకుండానే లోనికి వెళ్ళి దభాలున చేతిలోవున్న క్లాసు పుస్తకం డ్రాయర్ మీద గిరాటేస్తూ, తన వెనకే భయపడుతూ వచ్చిన భార్యను "నువ్వు మీ అన్నయ్యకు ఉత్తరం రాశావు గదూ?" అన్నాడు. శాంత గాభరాపడి మెల్లగా అంది అవునని. "ఏమని రాశావ్?" అన్నాడు, చొక్కా విప్పుకుంటూ. "కార్డులో మూడు ముక్కలు రాశాను..." అది. "కార్డు రాశావో కవరు రాశావో నాకవసరం లేదు. ఏం రాశావో నాక్కావాలి"-అన్నాడు, ఊర్ధ్వ కంఠంతో! ఆకంఠంలో ఉద్ధృతం వుంది. అతని కళ్ళల్లో చింతనిప్పులు వర్షిస్తున్నాయి. దీనికి ఆమె హృదయం తల్లడిల్లింది. మోము వాడిపోయింది. ఏమీ సమాధానం చెప్పేందుకు అవగతంకాక తికమకపడింది. తను రాసిన ఉత్తరం గుర్తుకొచ్చింది. అలా రాసినందుకు బాధపడింది. ఆరోజు అలా చంద్రం ఆమెను అనరాని మాటలు అనివుండక పోయినట్టయితే ఉత్తరం రాయకనే పోను! ఇప్పుడేమనుకొని ఏం లాభం! జరగవలసిందేదో జరిగిపోయింది. ఆడపిల్లగా జన్మించి, పరాయి గృహానికి వచ్చి, ఒక వ్యక్తికి భార్యగా కట్టువడినప్పుడు ఎన్ని ఇబ్బందులురావు? వాటన్నిటికీ కుంచుకపోయి పుట్టింటివేపు చూట్టం భావ్యమా మరి! ఇలా అనుకొని తన బాధల్ని తన కష్టాల్ని దిగమింగ గలిగే ఆడవాళ్ళ సంఖ్య బహుతక్కువ! హృదయం చివుక్కుమన్నప్పుడల్లా తనవేపు వాళ్లు స్మృతిపథంలో మెదలటం సహజం! శాంత విషయంలో కూడా ఇదే జరిగింది.

ఓరోజు చంద్రానికి శాంతమీద కోపం వచ్చింది, సాధారణంగా ప్రతి భర్తకూ తన భార్యమీద వచ్చినట్లే. చాలా గట్టిగా కోప్పడ్డాడు. అతనంటే ఆమెకు నిర్లక్ష్యమన్నాడు. ఆమెను వివాహం చేసుకోటంలో తను పొరపడ్డాడట! దీనికి కారకుడు శాంత అన్నయ్య మధు అనీ, కొత్తమెరుగులు ఏర్పడి ఆనందకళా విరాజిత మవుతుందనుకున్న జీవితంలో నిరాశాంధకారం అలుముకుందనీ, పైగా ఒక్కచిల్లి గవ్వకూడా కట్నరూపంగా తీసుకోక ఒక ఆదర్శభావాన్ని దర్శించినా, దీనికి ప్రత్యామ్నాయంగా తను పొందవలసిన గౌరవాభిమానాల్ని తాను పొందలేక పోయాడనీ మధు తనను సర్వవిధాలా భ్రమల్లోకి లాక్కుపోయాడనీ - ఇలాగే ఎన్నెన్నో అన్నాడు.

ఆ రోజు శాంత ఎంతో బాధ పడింది. ఏదో భయంకరమైన మృత్యు ఝంఝు తన జీవితాన్ని తరుముతూన్నట్టూ, ఏదో అఘాతం నోరు తెరుచుక ఘకాలున నవ్వినట్లూ తోచింది. "నా జీవితం పురుషుని చేతులోని ఒక వ్యంగ్యచిత్రమయిపోయింది. ఇంతేనా నాబ్రతుకు?" అని అనుకొని శాంత తన అన్నయ్యకు ఒక కార్డు రాసింది...

దండమూడి మహీధరకుమార్

"ప్రియమైన మధు అన్నయ్యకు,

చెల్లి నమస్కృతులు. నాజీవితంలో నువ్వు కాంతి పుంజాల్ని వెదజల్లాలని చూచావు కాని, అది అంధకారబంధుర మైపోయింది. నేను చంద్రంగారి అంతరంగంలో సముచితస్థానాన్ని అలంకరించగలిగిన విజ్ఞత, విద్యాధికత, గుణగ్రహణపారీణత కలిగి లేనందుకు విచారిస్తున్నాను... నీ సోదరి... శాంత."

దీనికి సమాధానంగా మధు చంద్రానికి ఒక లేఖ వ్రాశాడు. ఆ ఉత్తరం చదువుకున్నాక చంద్రంలోని సహనం తాలూకు తెర చిరిగిపోయింది. వైరుధ్యం ప్రవేశించి ఎన్నెన్నో భావాల్ని సృష్టించింది. ఆఖరికి తన వివాహ ఘట్టంమీదనే ఎక్కడలేని ఈసడింపుభావం ఉద్భవించింది. మధు ఇలా రాయటానికిగల కారణాలు ప్రథమంలో బోధపడకపోయినా, ఆఖరికి ఆలోచించినమీదట... "శాంత బహుశా మధుకు ఆమెయెడల నేను అవలంబిస్తున్న వైఖరిని లేఖద్వారా తెలిపివుంటుంది" అని వూహించాడు. చివరకు జరిగిందికూడా ఇదే!

శాంత మాట్లాడకుండా నేల చూపులు చూస్తోంది. మధు చొక్కావిప్పి వంకెకు తగిలించి కుర్చీమీదఉన్న తుండుగుడ్డ పైన వేసుకొని కిటికీలోగుండా బయటికి చూస్తున్నాడు. పడమటి సంద్రంలో సూర్యుడు ఎఱ్ఱనిరంగు పూసుకొని కుంకుతున్నాడు, ఏదో అపాయాన్ని సూచిస్తూ.

"ఏం రాశావ్?" అని గాండ్రించాడు, ఇటువేపు తిరక్కుండానే, చంద్రం. ఆమె ఒక్కసారిగా తల్లడిల్లిపోయింది. ఏమీ సమాధానం చెప్పకపోతే చంద్రానికి మరీ కోపంరావచ్చు! వణుకుతున్న గొంతుకతో అన్నది: "నేను మిమ్ముగురించి ఏమీ రాయలేదు. నావిధిని నేను తిట్టుకున్నాను. మీ హృదయాంతర్భాగంలోకి ప్రవేశించగలిగే సామర్థ్యం లేనందుకు బాధపడ్డాను" అని.

"నువ్వేమీ చెప్ప నవసరంలేదు. నువ్వు రాసింది నాకు తెలుసు... నేను నీతో అన్న ప్రతిమాటా మధుకు రాసివుంటావు" అని అన్నాడు, ఆరకంగా రాసే హక్కు స్త్రీకి లేదనే భావాన్ని ధ్వనింపజేస్తూ! "పురుషుని చెప్పు చేతల్లోనే వుండాలా" అనే ప్రశ్న ఎప్పుడూ ఆమెలో జనించలేదు. కాని చంద్రం శాంత అలాంటి ప్రశ్నమీద ఆలోచించి మధుకు లేఖ రాసివుంటుందని భావించాడు.

కళ్లల్లో నీరు నింపుకొని అలా రాయలేదని చెప్పింది.

"అయితే మీ అన్నయ్య ఇలా ఎందుకు ఉత్తరం రాయాలి?" అని చంద్రం వంకెన తగిలించిన చొక్కా జేబులోనుంచి మధు రాసిన ఉత్తరంతీసి శాంతముందు గిరాటేశాడు, అలా రాయటానికి కారణాలు శాంత అయినట్టు! శాంత వణుకుతున్న చేతులతో ఆ ఉత్తరాన్ని తెరిచింది.

"శ్రీ చంద్రానికి,

మధు అభివాదాలు

వాస్తవిక జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని పరిష్కరించుకోలేక ఆ అశక్తతను భార్యమీద చూపటం అదేమంత గొప్పతనం కాదు. ప్రతి వ్యక్తి తనెలావున్నా తను వివాహమాడినభార్య మటుకు అన్ని విధాలా అతి మిన్నగా వుండాలని కోరుకుంటాడు. నిరాశా భావాల్ని మనస్సులో నిండించుకొని జీవిస్తూ తనభార్యమాత్రం తన హృదయ సీమలో సౌఖ్యానందాల దివ్య జ్యోతుల్ని వెలిగించటంలేదని ఆమెను నిందిస్తాడు. ఇది పొరపాటు! పురుషుడు ఆశల ప్రపంచంలో జీవిస్తూన్నప్పుడు స్త్రీ అతనికి సాయపడుతుంది. గృహాన్ని దేవాలయం చేస్తుంది. గృహస్థ జీవితంలో మధురిమ ఒలికిపోతుంది. జీవితానికి ఎన్నో అర్థాలు వాటంతటవి ఏర్పడతాయి. ఇదంతా పురుషుని చేతిలోవుంది. దీన్ని విస్మరించిన రోజున నీలాగా ప్రతిభర్తా భార్యను "నువ్వునాకు తగిందానివికాదు... నా జీవితానికి ఫలానారకంగా వర్తించేవాళ్లు కావాలి" అని ఊహల దోనెల్లో విహరిస్తారు.

"తన సహజ మనోగత భావాల్ని కార్యరూపంలోకి మార్చటం చేతకాక రిచ్చపడి, ఎడదల్లో కలతల్ని రేపుకొని, తనభార్యతో—'నీ పుట్టింటివాళ్లు నన్ను గౌరవాభిమానాలతో చూట్టం లేదని' ఆమెను ప్రతి నిముషమూ సాధించటంవల్ల నీకు ఒరిగేదేదీ లేదు.

"కట్నాలు కానుకల ఆశ నాకు లేదు. వ్యక్తుల ఉన్నత హృదయ భావ సంపదే నాకు పదివేలు. మీ సదయ హృదయాలు నన్ను సమ్మోహితుణ్ణి చేశాయి. అని ఎన్నెన్నో సిద్ధాంతాల్ని ఏకరువుబెట్టి-ఆ తరువాత గతాన్ని విస్మరించావు, వాస్తవిక జగత్తులోని పరిస్థితుల తాకిడికి తట్టుకోలేక ఆర్థిక విలువల్ని అర్థం చేసుకోక కట్నాన్ని కాలదన్నానని విచారిస్తూ వుంటావు. ఇది నీ హృదయ దౌర్బల్యాన్నే సూచిస్తుంది.

"వివాహం ఒక పరీక్ష. దానిలో ధైర్యంగా నిలబడగలిగితేనే విజయం. తన దారి తను చూచుకోక ఎవరో తనకు పరిష్కార మార్గం బోధపరుస్తారని అనుకోటం తెలివి తక్కువ! ఆడపిల్ల తరఫు వాళ్లు ఏంచేసినా పెళ్ళి అయేంత వరకే! ఆపైని ఆమె జీవితానికి, సాంఘిక విలువల ప్రకారం వెలుగు, ఒక్క చేసుకున్న భర్త వినా మరెవరూ చూపలేరు. అలా కాక నీవు ఒకవేళ ఎవరో ఆదుకోటం లేదని వైరుధ్యాన్ని ఏర్పరుచుకుంటే ఎన్నో అనర్థాలకు లోను కావలసివుంటుంది. చిన్న చిన్న వాటికి పెద్ద పెద్ద కారణాల్ని సృష్టించటం జరుగుతుంది. అయిన దానికీ, కానిదానికీ, అభిమానం చూపించి నిష్ఠూరాలు వేయటం ప్రారంభమవుతుంది. వీటన్నిటికీ నువ్వు అతీతుడవు కావాలి. ఒక రకమైన నిర్లిప్తత అవసరం.

"ఈ ఉత్తరం చూచేనా నీవు నీ వెనుకటి జీవితాన్ని పునఃప్రచాలనం చేసుకొని సరిదిద్దుకుంటావని ఆశిస్తున్నా.

నీ ప్రియ, మధు."

శాంత ఈ ఉత్తరం చదువుకొని అమితంగా బాధపడింది. గాయంమీద కారంచల్లి ఫుల్లతో కెలికినట్లు ఆమె హృదయపు అంచుల చుట్టూ విషాదాంధకారం అలుముకపోయింది.

ఉత్తరం చదివి కవరులో పెడుతున్న శాంతను చూచి చంద్రం"ఏం? అలా రాశాడు నాకు ఉపదేశాల్ని చేయటానికి ఇతగాడెవరు? తను మహా ఘనుడైనట్లు మరొకరి జీవితంలోకి ప్రవేశించి ఏవేవో నీతివాక్యాల్ని వల్లించి తన చవకపారు భావాల్ని ఫోకస్ చేశాడు. కట్నాన్ని గూర్చి ఆలోచించుకోటం వట్టి దౌర్బల్యంక్రింద జమకట్టాడు. వివాహం ఒక పరీక్ష అనీ, ఆపరీక్ష ప్యాసవటానికి ఫలానా చిట్కాలు పనిచేస్తాయనీ ఉద్బోధించాడు. ఒక అతీతత్వాన్ని పొందవలసిందనీ, నిర్లిప్తతను నేర్చుకోవలసిందనీ రాశాడు. ఇవన్నీ ఆచరణకు నిలువని చిట్కాలే! వీటిని ఎవరేనా ఉద్బోధించవచ్చు! ఇంతకూ మధు ఇన్ని రాయటానికి కారణం నువ్వే! నీఉత్తరమే ఇలాంటి అర్థంలేని విషయాల్ని రాయించేందుకు ఆస్కారం కలిగించింది" అని అన్నాడు బయటికి వెళ్తూ.

నలువేపులా అంధకారం అలుముకుంటోంది.

ఇంట్లో దీపం వెలగించలేదు.

శాంత హృదయాన్ని ఏవో విషాదాగ్ని జ్వాలలు దీపింప జేస్తున్నాయి. ఆమెలోని కన్నీరు ఇంకిపోయింది భావాలు కరుడుగట్టటం చేత. తన అన్నయ్య ఎందుకలా రాశాడో ఆలోచించలేకపోయింది. అలా చాలాసేపు జడవస్తువులా అక్కడే పడివుంది.

* * *

మధు ఊళ్ళోనే హైస్కూల్ వుంటంచేత స్కూలుఫైనల్ దాకా చదువుకొని, అది ప్యాసయ్యాక కాలేజీ చదువుకోసం నగరం వెళ్ళేడు. కాలేజీలో చదువుతూ సెలవలకు వచ్చినప్పుడు మధు అందరిలా సాయంత్రపువేళల్లో లైబ్రరీలో కూచొని కేరమ్సు ఆడుకుంటూ కాలేజీ ఆడపిల్లల్ని గూర్చి కథలుగా చెప్పుకునే కార్యక్రమంలో పాల్గొనక హైస్కూలు గ్రౌండులో కూచొని రాజకీయాలమీదా, సాహిత్యంమీదా తర్జనభర్జనలు చేసే హైస్కూలు ఉపాధ్యాయుల దగ్గరకెళ్ళి కూచునేవాడు. కాలేజీలో చదువుతున్న కారణాన మధును వాళ్ళంతా ఆదరంతో చూచేవారు. వాళ్లల్లో మధును ఆకర్షించి, తన వయస్సులోనే వుండి తనలాంటి భావాల్నే కలిగి తనకు బహు తక్కువ కాలంలోనే మిత్రుడుగా మారాడు, క్రొత్తగా ఆ స్కూల్లో మాష్టరుగా చేరిన చంద్రం.

మధు కాలేజీలో ఆఖరు సంవత్సరం చదువుతున్న సమయానికి ఉభయుల మైత్రివల్లరి పెరిగి పెద్దదయింది. ఒకరి మానసిక దృక్పథాలతో మరొకరు ఏకీభవించారు. పరస్పరానుభూతుల్ని అర్థం చేసుకున్నారు. తత్ఫలితంగా చంద్రం

వివాహం మధు చెల్లెలు శాంతతో జరిగి పోయింది.

రెండు వసంతాలు గడిచీ గడవక మునుపే చంద్రం ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా లేకపోవటంవల్ల గృహస్థజీవితంలో కల్లోలం ప్రారంభమయింది. మధుకూ, చంద్రానికీ మధ్యగల సద్భావాలు అంతరించి పోయాయి.

* * *

మధుకు చంద్రానికీ మధ్య ఉత్తరాల్లో ఎంతో రగడ జరిగిన కొద్ది రోజులకే హైస్కూలుకు సంక్రాంతి సెలవిలిచ్చారు. అదే ఊరు కావటంవల్ల ఆరాత్రి శాంత తన పుట్టింటికి వచ్చేసింది.

శాంత నాన్న కూతుర్ని చూడగానే— "చంద్రం రాలేదే"అని ప్రశ్నించాడు. "వాళ్ళ ఊరు వెళ్తానన్నారు నాన్నా"అన్నది."పండగ దగ్గర కొస్తూంటే ఇప్పుడెందుకు వెళ్తున్నాడు? పని వుంటే తరువాత వెళ్ళవచ్చుగా! అలా అని చెప్పలేదా?" అన్నాడు శాంతనాన్న. "లేదని" సమాధానం చెప్పింది శాంత.

శాంత నాన్నకు అర్థంకాలేదు. ప్రతి పండుగకూ అల్లుడూ, కూతురూ వచ్చి ఆ నాలుగు రోజులూ తన ఇంట్లోవుండి ఆ తరువాత మరల ఎప్పటిలా వాళ్లుభయులూ వుంటున్న ఇంటికి వెళ్ళటం పరిపాటయిపోయింది పెళ్ళయిన దగ్గర్నుంచీ! ఈనాడు అలా జరగనందుకు శాంత నాన్నకు ఏదో అనుమానంగా తోచటంలో ఆశ్చర్యంలేదు. ఊళ్లో ఎటుచూచినా ఆనంద నిర్ఝరి ప్రవహిస్తోంది. ప్రతి ఇంటికీ సున్నం కొట్టించి ఎంతో అందంగా అలంకరిస్తున్నారు. ఇళ్ళముందు పెద్దపెద్ద ముగ్గులు, ఆ ముగ్గులమీద గొబ్బెమ్మలు... హరిదాసులు పాడుకుంటూ ప్రతి బజారు తిరుగుతున్నారు. ఇవన్నీ ఆయన మెదడులో తిరిగిపోయాయి.

చెరువు గట్టుమీద కెళ్లినా, లైబ్రరీ అరుగుల మీద కూచున్నా పండగలకు ముందు ప్రతి ఒకళ్ళూ ఊళ్ళోని అల్లుళ్ళను గూర్చే చెప్పుకుంటారు–అదేదో తమ సమస్య ఐనట్టు. శాంత నాన్నను వరస కలవాళ్లు "బసవయ్యమామా! అల్లుణ్ణి పిలిపించావా?" అంటే శాంత నాన్న ఏం సమాధానం చెబుతాడు?

ఇలా ఎన్నెన్నో ఆలోచించిన మీదట శాంతనాన్న "రానన్నాడా!" అని అడిగాడు. శాంతకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కావటంలేదు. అంతవరకూ లోపల పనిచేసుకుంటున్న శాంత తల్లి అప్పుడే బయటికొచ్చి తండ్రి కూతుర్ని "రానన్నాడా!" అని అడగటము విన్నది.

"ఏ మొహం పెట్టుకొని వస్తాడు?" అంది, శాంత తల్లి. ఆయనకేమీ బోధపడక ఒక్కసారి తలపైకెత్తి "అసలు సంగతేమిటో చెప్పకుండా రాద్ధాంతం చేస్తున్నావు. ఏంజరిగింది"అన్నాడు అప్పటి వరకూ చుట్టుకుంటున్న చుట్ట చివర తుంచేస్తూ!

"నేను మొదట్లోనే చెప్పాను, ఈ సంబంధం మనకు అక్కర్లేదని! స్కూలుమాష్టరు ఉద్యోగంకూడా ఒక ఉద్యోగమేనా? వాడేదో పిల్లకాకి ఆయన్నిగురించి నాలుగు ముక్కలు చెప్పగానే సంబరపడ్డారు. 'ఉద్యోగం కాదు ప్రధానం,ఆఉద్యోగానికి సంబంధించిన విద్యుక్త ధర్మాల్ని నిర్వహించటంలో వ్యక్తికి శోభ వున్నది. చంద్రం ఎంత చక్కగా ఆ పదవిని నిర్వహిస్తున్నాడో మీకు తెలీదు. ప్రతి ఒక్కరి మన్ననలకూ పాత్రుడై ఎంతో నేర్పుగా ప్రవర్తించగలిగిన వ్యక్తి అతనొక్కడే! అలాంటి చంద్రాన్ని మధు గుర్తించి చాలా గొప్పపని చేశాడు. చంద్రం శాంతకు అన్నివిధాలా తగిన భర్త' అని నా కేవేవో చెప్పి నా నోరు మూయించారు. కాని కథ మీరనుకున్నట్టుగా నడవలేదు. చీటికిమాటికి కోప్పట్టం అయిన దానికీ, కానిదానికీ ఏవేవో అర్థాలతో, తృణీకారభావంతో ఎల్లవేళలా సాధించటం, ఆయనకు అలవాటయిపోయిందట. కొస్త పొరపాటు జరగ్గానే దాన్ని అనరాని మాటలని దాని మనస్సును నొప్పిస్తాట్ట! "నీ పుట్టింటి వాళ్లు అప్పుడలాచేశారనీ, మరొప్పుడు ఇలా చేశారనీ, కట్నం రూపంలో కానీ లభించలేదనీ, గౌరవాభిమానాలతో చూడటం మీకెవరికీ చేతగాదని ఏవేవో అని ఆయన తన హృదయ సంకీర్ణాన్ని చూపించుకున్నారేగాని మరోటి కాదు.

"'నాబ్రతుకు ఈరీతిగా తెల్లారుతోంద'ని

మధుకు ఉత్తరం రాస్తే వాడేదో రాశాట్ట! దానికిగాను మళ్ళా శాంతను సాధించాట్ట-ఇంటి గుట్టు బట్టబయలు చేస్తున్నాడని! ఎన్నో దుర్భాషలు సైతం ఆడేట్ట! ఇన్ని చేసిన అల్లుడంటే మీకు పూజ్యభావం! ఆయన్ను ఒక గొప్ప వ్యక్తిగా చిత్రిస్తారు. నిన్నమొన్న నిన్న "స్కూల్లో జరిగిన సభలో చంద్రం తన కవిత్వాన్ని వినిపించేటప్పటికి అక్కడి వాళ్ళంతా మంత్ర ముగ్ధులయ్యా"రని చెబుతూ "నిజంగా చంద్రం గొప్పవాడు" అని పొగిడేరు. ఇప్పుడు వింటున్నారుగా ఆయన గొప్పతనం! ఏం లాభం? "ఇంటిపేరు కస్తూరివారు ఇంట్లో గబ్బిలాలకంపు!" ఇంతఘనంగా మీ రాయన్ని చూస్తారా, చివరకు ఆయన "మీ వాళ్ళకు నేనంటే గౌరవాభిమానాలు లే"వని అంటారు."

ఈ మాటల్ని శాంత తల్లి చెబుతూంటే ఆయన ఎంతో శ్రద్ధగా విన్నారు. మధ్యలో ఎక్కడా ఒక్క ప్రశ్న సైతం వేయలేదు.

అప్పటికి ఆయన కాల్చుకుంటున్న చుట్ట సగంవరకు కాలిపోయింది. ఆ చుట్టనుంచి అంత పొగ వస్తున్నా ఎక్కడా నిప్పుఉన్నట్టే కన్పించటంలేదు. ఆలోచిస్తూ మధ్యమధ్యలో చుట్ట కొడి రాలుస్తూ కిటికీలోగుండా బయటికి ఉమ్మేస్తున్నాడు.

ఎదురుగోడకు శాంత-చంద్రం పెళ్ళినాడు తీయించుకున్న ఫోటో వేలాడుతోంది. దానికి దగ్గరలోనే శాంత తల్లినిల్చొని ప్రశ్నార్థకంగా చూస్తూంది ముసలాయనవేపు. శాంత బయట వాకిలి ప్రక్కగా నిల్చొని అన్నీ వింటోంది.

"ఇదుగో చూచావూ! నువ్వేమో చాలా చాలా చెప్పావు. చంద్రాన్నిగూర్చి ముఖ్యంగా నువ్వు చెప్పిన మాటలు నేను నమ్మలేను. చంద్రం ఎప్పుడూ అలా వర్తించడు. ఇలా అని నేను శాంతను శంకించటం లేదు. అయినా 'మన నువ్వుల్లో నూనె లేకపోతే తెలికలవాణ్ణంటేమాత్రం లాభ మేముంది?' ఏవో నిష్ఠురాలు వేశాడని బాధపట్టమేగాని... వాటికి మూలమేమిటో మనం తెలుసుకోం! అయినా నిష్ఠూరాలు పిల్ల తరపువాళ్ళమీద కాక మరెవరిమీద వేస్తారు? పిల్లనిచ్చిన తరువాత తుస్కారాల్నీ, తృణీకారాల్నీ తట్టుకునే తాహతు కూడా వుండాలి. బాంధవ్యాల్ని నిలబెట్టుకోటానికి కూడా ఒక గొప్ప మేధాశక్తి అవసరం. అది ఒక సన్నని నూలు పోగులాంటిది. అది తెగకుండా ఎంతో మెళకువతో చూచుకోటంలోనే గొప్పతనం వుంది. కాని ఆడవాళ్లు ఈ విషయాన్ని అర్థం చేసుకోక ప్రతి నిమిషం అంతిమ నిర్ణయాలు చేసుకునేందుకే ఆయత్తమవుతారు. నువ్వూ ఇలాగే వర్తించబోతున్నావు.

లోకంలో ఏ భర్తా తన భార్యను అనవసరంగా హింసించడు. ప్రతి వాళ్ళకూ ఏవో మూలకారణా లుంటాయి. అయితే, చంద్రం విషయంలో ఇలాంటి కారణాలేవీ లేవనే చెప్పగలను. ఉత్తరాల్లో గీచుకునే వంకర గీతలు చంద్రానికీ మధుకూ మధ్య చంద్రానికీ శాంతకూ మధ్య అకారణ వైరుధ్యాల్ని ఏర్పరచినాయి. శాంత మధుకు ఉత్తరం రాసి వుండాల్సింది కాదు! ఇప్పటి కాలపు యువతీ యువకుల్లో ఉద్రేకం అధికం. విషయాన్ని అర్థం చేసుకోకుండానే ఒకరినొకరి దూషించుకుంటారు. సాంసారిక జీవితంలో పొరపులు సంభవించటం పరిపాటి. అవి ఎక్కువ కాలం వుండవు. అలాంటివాటిని బహిర్గతం చేయుటం అవివేకమే! మధు చంద్రాన్ని ఏమన్నా చంద్రాన్ని మధు ఏమన్నా ఉద్రేకంలో అనుకున్నవే. వీళ్లు తాము రాసుకునే ఉత్తరాలలో ఉపయోగించే పదాల మీద కుస్తీలు పడతారు. ఒకరి భావాన్ని మరొకరు అర్థం చేసుకునే స్థితిలో లేనప్పుడు ప్రతి శబ్దంలో విపరీతార్థం గోచరించటం సహజం! ఇలా నేలవిడిచి సాము చేయటంవల్ల సమస్యలు పరిష్కారం కానేరవు. గృహ కల్లోలాలకు ఇలాంటి వుత్తరాల్లోని వంకర గీతలు చాలా వుపయోగిస్తాయి.

సంబంధాలు చేసుకున్నాక లోటుపాట్లు జరగటం సహజం. వాటిని సర్దుకపోవాలి. ఇందుకు ఉత్తర ప్రతాపాలేమీ పనికిరావు. ఎట్టెదుట నిలబడి సమస్యల్ని పరిష్కరించుకోవాలి! ఒక్కొక్కప్పుడు ఒకరినొకరు సమీపంలో చూచుకోటంతోటే ఇవి సమసిపోతాయి. అలా కాక రెండు సంవత్సరా లనంతరం ఈ సంబంధం మనకక్కర్లేదని మొదట్లోనే చెప్పానని

అంటం నీ తెలివి తక్కువకు గాఢ నిదర్శనం. ఇవి సహజంగా ఆడవాళ్లు అనే మాటలే! ఇక ముందెప్పుడూ ఇలాంటి మాటలు నాదగ్గర చెప్పకు. ఏదో పాతకాలపు మనిషివిగనుక సరిపోయింది."

ఇవన్నీ ఆయన హృదయంలోనుంచి వచ్చిన మాటలు. శాంత వీటన్నిటినీ విని తప్పుచేసిన దానికి మల్లే ప్రక్క గదిలోకెళ్ళి తలుపేసుకుంది.

"ఇవన్నీ నాకేం చెప్పండి...సరే" అన్నది శాంత తల్లి, బయట గడపమీద వున్న లాంతరు తీసుకొచ్చి గదిలోపల బల్లమీద పెడుతూ. అప్పటికి శాంతనాన్న చుట్ట ఆరిపోయింది. 'సరే! కాసిని మంచినీళ్లు పట్టుకరా!' అన్నాడు చుట్ట బయటికి గిరాటేస్తూ. ఆమె లోనికెళ్ళి గ్లాసుతో నీళ్లు తీసుకొచ్చి బల్లమీద పెట్టగా, వాటితో ఆయన నోరు పుక్కిలించి రెండు గుటకలు తాగేడు. ఆ తరువాత దణ్ణెంమీది పైపంచ భుజంమీద వేసుకొని మూలనున్న కర్ర చేత్తోపుచ్చుకొని బయటికి వెళ్ళాడు, చెప్పులు తటతట మనిపించుకుంటూ, మీసాల్ని పైపంచతో వత్తుకుంటూనూ! ఏక్కడికని అడగటానికి శాంతతల్లికి సాహసం చాలిందికాదు. ఇదివరకయితే ఆమె అడక్కుండానే ఆయనే చెప్పేవాడు. ఇవ్వాళ్టి వాతావరణం వేరు.

* * *

చంద్రం ఆరాత్రికే వాళ్ళవూరు వెళ్తానని శాంతతో చెప్పి రాత్రిపూట వెళ్లటం ఇష్టంలేక ఉదయమే వెళ్లిపోదామని తీర్మానించుకొని ఏదో పుస్తకం చదువుకుంటూ కూచున్నాడు. ఈ సమయంలో శాంతతండ్రి చప్పుడు చేసుకుంటూ లోనికిరావటం చంద్రాన్ని ఆశ్చర్యంలో ముంచేసింది. 'శాంత నాన్న చాలా గంభీరమైన వ్యక్తి. అనుకున్నప్పుడల్లా ఒకరి దగ్గిరకెళ్లే ప్రకృతికాదు. శాంత నామీద ఏవేవో చెప్పి వుంటుంది. ఆ సందర్భంలో మాట్లాడేందుకు వచ్చివుండొచ్చు' అని పరిపరి విధాల ఆలోచిస్తూనే, మంచంమీద కూచునేందుకు చోటు చూపించాడు.

రెండుసెకండ్లపాటు ఉభయులూ మౌనంగా వున్నారు.

"చంద్రం! మీ వూరు వెళ్ళాలన్నావట కదూ! ఇప్పుడు వెళ్ళకపోతేనేం? సంక్రాంతి పండుగ గడిచాక కూడా కొద్దిరోజులు సెలవలున్నాయి కనుక- ఆపైనే వెళ్ళొచ్చు! రేపుదయం లేవగానే ఆఇంటికి రావటం మరచిపోకు!' అని చంద్రంవేపు చూచి శాంతనాన్న అంటూంటే చంద్రం పుస్తకాలు పేజీలు తిరగేస్తూ, 'సరేలెండి!' అన్నాడు, 'అయితే నే వస్తా' అంటూ శాంతనాన్న బయటికి నడిచి రైలుస్టేషన్ వైపు వెళ్ళాడు.

* * *

రాత్రి తొమ్మిది గంటల వరకూ, శాంత నాన్న ఇంటికి తిరిగి రాకపోవటంచేత, శాంత శాంతతల్లి చాలా విచారించారు. ఇంత పొద్దుబోయేదాకా ఎప్పుడూ బయటవుండని ఆయన ప్రకృతిని తలుచుకొని ఉభయులూ కళ్లల్లో వత్తులుపెట్టుకొని ఎదురు చూస్తున్నారు.

పదిగంటల బండి స్టేషన్లో కూతేసి సాగిపోయిన కాసేపటికి శాంతనాన్న ఇంటికి వచ్చాడు. అప్పుడు వాళ్లిద్దరి మనసులు కుదటబడ్డాయి.

ఆయన అన్నం తినేప్పుడుగాని, ఆతరువాతగానీ శాంత, శాంతతల్లి - ఉభయుల్లో ఎవరూ ఏమీ అడగలేకపోయారు. భోంచేసి వసారాలో లైటుకెదురుగా కూచొని పుగాకు ఈనెలు తీసుకుంటూ శాంత నాన్న "రేపు ఉదయం చంద్రం వస్తాడు. మనస్సులో ఎలాంటి భేదభావాలు లేకుండా ఎప్పటిలా మసులుకోండి" అన్నాడు.

చుట్ట వెలిగించుకొని కాల్చుకుంటూ మంచంమీద కెళ్ళికూచున్నాడు. శాంత, శాంతతల్లి లోనికి వెళ్ళిపోయారు రాబోయే "రేపు"ను స్మరించుకుంటూ!

* * *

ఉదయమైంది. శాంత తెల్లవారు ఝామునే లేచి, కళ్ళాపిజల్లి ఇంటిముందు సంక్రాంతి ముగ్గువేసింది. శాంత నాన్న ప్రక్కనేవున్న చావడిదగ్గర నిల్చొని పాలేరుచేత పనిచేయిస్తున్నాడు. బుల్లి కోడెదూడ గంతులేస్తూ శాంత నాన్నను మధ్య మధ్యలో వచ్చి మూతి చూస్తోంది.

ఏడుగంటలవుతుండగా చంద్రం ఏవో పుస్త

కొలూ, పత్రికలూ చేతిలో పుచ్చుకొని అత్త గారింటి కొచ్చాడు. అదివరకే వసారాలో చంద్రం కోసం మంచంవేసి వుండటంచేత దాని మీద కూచొని పుస్తకాల పేజీలు తిరగేయటం, శాంత నాన్న చావిట్లోనుంచి చూచి తొరతొరగా పాలేరుచేత పాలు దొడ్డి వాకిట్లో గుండా లోనికి పంపించి, గంతులేస్తున్న దూడ పలుపు చేతిలో పుచ్చుకొనే అది చిక్కినట్లే చిక్కి పారిపోతుండగా విసిగి, పలుపు చేత్తోనే అల్లుణ్ణి సమీపించి "కాలకృత్యాలయినాయా!" అన్నాడు. "ఏడు గంటల దాకానా" అన్నాడు అల్లుడు తలెత్తి నవ్వుతూ! "అవునులే! పిల్లలకు మీరు స్కూల్లో చెప్పేదే అదిగా! దాన్ని మీరే అమలు పరచకపోతే స్కూలు కుర్రాళ్లు మీకే తాటాకులు కడతారు!" అని మామ నవ్వుతూ అంటే - "పిల్లలదాకా ఎందుకు మీరే అంటారు!" అన్నాడు, మళ్ళా మెల్లగా నవ్వుతూ చంద్రం.

శాంత నాన్న లోనికి చూచేప్పటికి శాంత ఈ సంభాషణను వింటున్న దానిలా నిల్చున్నది. "చంద్రం వచ్చాడు మరి! ఫలహారం కాఫీ తయారయిందా!" అన్నాడు. "గదిలోకి పిలవండి అన్నీ సిద్ధమే" అంది శాంత.

ఉభయులూ గదిలో కెళ్ళారు. శాంతనాన్న కుర్చీ ఇవతలకు జరిపి కూర్చోమని - బయటికి వెళ్లి "అవేవో చూడండి" అని దొడ్డి వాకిట్లోనుంచి చావిట్లోకి వెళ్లాడు బుల్లి కోడెదూడను కట్టేయటానికి. అది గంతులేసి గంతులేసి తల్లిదగ్గరకు చేరింది.

బుల్లి కోడెదూడ మెడలో పలుపు పెడుతూండగా ప్రక్క గదిలోనుంచి శాంత, చంద్రం హాస్యపరిహాసాలూ మధురధ్వనులూ, నవ్వుల గలగలలూ - శాంత తండ్రికి వినిపించినప్పుడు ఆయన తన్నుతాను మరచి బుల్లి కోడెదూడ డోలు ప్రేమగా నిమురుతూ కూచున్నాడు.

* * *

సూర్యుడు పశ్చిమాద్రిన క్రుంగిన కొన్ని క్షణాలనంతరం, మధు మద్రాస్‌నుంచి తన భార్యా కొడుకుతో ఆ ఇంటిలో ప్రవేశించినప్పుడు అందరూ ఒక్కసారిగా ఆశ్చర్య సంభ్రమంలో మునిగిపోయారు - ఒక్క శాంత నాన్నను మినహాయించి! సెలవలు దొరకని ఉద్యోగాన్ని వదిలి ఇంత అకస్మాత్తుగా ఎలా వచ్చాడోనని, శాంతా, శాంతా తల్లీ, మరీ మరీ అనుకున్నారు.

చంద్రం అప్పుడే షికారుకెళ్ళివచ్చి వసారాలో కూచున్నాడు. శాంత నాన్న చుట్ట కాల్చుకుంటూ వసారా చివర కూచొని, మకర సంక్రాంతిమీద రేగుతున్న అనుమానాల్ని గూర్చి ఏదో చెబుతున్నాడు. శాంత, శాంత తల్లీ లోపల పనిలోవున్నారు. మధు చంద్రాన్ని చూచీ చూడనట్లే నటించి లోని కెళ్ళాడు. మధు భార్య కొడుకును చంకనెత్తుకొని రావటం చూచి శాంత నాన్న చంద్రంతో-"చూచావా! నీ అల్లుడొస్తున్నాడు" అన్నాడు. అప్పటికే ఆమె వాణ్ణి దించి లోనికెళ్తుండగా, చంద్రం- "ఏం సుశీ! ఇప్పటిదాకా ఉన్నారే" అంటే "ఎక్స్‌ప్రెస్ లేటుగా వచ్చిందన్నయ్యా!" అని సమీపంలో మామగారు వుంటంచేత మరేమీ మాటాడక లోనికి వెళ్ళిపోయింది. అప్పటికి మధు మూడేళ్ళకొడుకు తాత దగ్గరకు పరుగెత్తాడు. వచ్చి వళ్ళో కూచున్న కుర్రాణ్ణి కాసేపు ఏవోవే.అడిగి ఆఖరకు "అదుగో! మీమామదగ్గరకి వెళ్లు" అని వేలుపెట్టి చూపించగా వాడు చంద్రంమీది కురికాడు. చంద్రం మంచంమీద కూచోబెట్టుకొని పత్రిక చేతికిచ్చాడు.

లోపల... మధు శాంత నడిగాడు-'నాన్న నాకు టెలిగ్రాం ఎందుకిచ్చినట్టూ'! అని. మొదట్లో శాంతకూ, శాంత తల్లికీ ఏమీ అర్థం కాలేదు. కాని కాసేపు ఆలోచించాకే నిన్న గుడివాడ వెళ్ళి టెలిగ్రాం ఇవ్వటానికి వెళ్ళబట్టే అంత రాత్రయిందని అనుకున్నారు. విషయం కూడా పూర్తిగా అర్థమైంది, ఉభయులకీ, కాని ఏమని చెప్పేట్టు? "కాదన్నయ్యా! నాన్న ఈ సంవత్సరంలో ఎన్ని సార్లు రమ్మన్నా రాలేదని ఆఖరకు ఈ పండుగకు ఎలాగేనా పిలిపించాలని టెలిగ్రాం ఇచ్చారు. ఇంతకంటె మరేమీ లేదు" అన్నది శాంత!

మధు పసివాడు కాడు పాతిక సంవత్సరాలు వచ్చాయి. తన తండ్రి పిలిపించటంలో అంతరార్థం అర్థమైంది. శాంత చెప్పిన కారణం

వల్లనే తను పిలిపించబడ లేదనిమాత్రం-తను తెలుసుకున్నాడు, కాని శాంతతో మళ్ళా ఈ ప్రస్తావనే ఎత్తలేదు.

రాత్రికి అంతా భోజనాలకు కూచున్నారు. కొన్ని నిముషాలుపాటు ఎవరూ మాట్లాడలేదు. ఆఖరకు ముసలాయనే సంభాషణ ప్రారంభించాడు.

"ఏంరా మధూ! మద్రాసు జీవిత మెలా వుంది? బండి సాఫీగా సాగిపోతోందా?"

"మద్రాస్‌లాంటి అందమైన నగరంలో ఎలావుందని అడగటమేమిటి మామయ్యా! సినిమాలు, కేఫ్‌లూ, బీచ్ షికార్లూ - జీవితం దివ్యంగా వుంటుందక్కడ" అన్నాడు చంద్రం.

"బాగా డబ్బున్న వాళ్ళకే మద్రాస్!" అన్నాడు మధు చంద్రంవేపు చూస్తూ.

"ఏం? నువ్వా సంపాయిస్తున్నావుగా, నూటఏభయి రూపాయిలూ, ఇవేమీ తక్కువ కాదు."

"అలా అనుకుంటున్నావా బావా! నిజంగా చెప్పాలంటే పల్లెటూళ్ళో నువ్వు జేసే హైస్కూలు ఉద్యోగంలోనే హాయి వుంది. జీతం మాటకొస్తే నూటఏభైరూపాయలు మద్రాస్‌లో "ఉఫ్" అంటే ఎగిరిపోతాయి. ప్రతిదానికీ డబ్బు పెట్టాలి, డబ్బు పెట్టినా సుఖంలేదు ... ఆ జీవితంలో కృత్రిమం వుంది. ఇలాంటి స్వచ్ఛమైన వాతావరణం అక్కడ మచ్చుకేనా కన్పించదు.

మధు ఈ మాటలు చెబుతూంటే అందరూ అతి ఆసక్తితో వింటున్నారు. శాంత, శాంత తల్లి శాంత తండ్రి ఏవో క్రొత్త లోకాల్ని చూస్తున్నారు -తమతమ హృదయ పటలాల మీద!

"అయితే మధూ! నీకు ఈ వాతావరణంలో ఈ ఉద్యోగంలో హాయి ఉందనుకుంటే, నా లాగా పల్లెటూళ్లోనే వుండరాదూ" అన్నాడు చంద్రం, ఈసారి తన మామవేపు చూస్తూ.

"దాన్ని నిర్వహించుకునే తాహతు వాడిలో వుంది గనుకనా" అన్నాడు శాంత నాన్న మధువేపు చూస్తూ.

"నిజంగా స్కూలు మాష్టరు ఉద్యోగమంటే ఇష్టంలేదు. దానికి కావలసిన యోగ్యత నాలో లేదేమోనని అనుకుంటాను. లేకపోతే అలాగే చేద్దును" అన్నాడు, మధు.

* * *

నాలుగు రోజులు గడిచాయి. ఎవరూ గతాన్ని గూర్చి ఆలోచించలేదు. మధుకొడుకు అందరి ఆనందానికి ఒక సాధనం అయ్యాడు.

మధు మరల మద్రాసుకు ప్రయాణం కాబోయే రోజు-మధూ చంద్రం వసారాలో ఒకే మంచంమీద కూచొని వుంటం చూచి-అక్కడికెళ్ళాడు-మధు తండ్రి.

"మీరు ఇవ్వాళ రాత్రి మెయిల్‌కు వెళ్తున్నారా?" అన్నాడు మధుతో.

అవునన్నాడు మధు.

"మీ ఉభయులకీ నేను చెప్పేది: మీరు ప్రతి విషయాన్నీ సామరస్యభావంతో పరిష్కరించుకోండి. వాస్తవిక జగత్తులోకి దిగి పరిస్థితుల్ని అర్థంచేసుకొని మరీ వర్తించటంలోనే జీవితానికి విలువలు ఏర్పడతాయి. మీరు గీచుకునే వంకరగీతలు వైమనస్యభావాల్ని ఉద్దీపింపచేస్తాయి. వీటన్నిటినీ అర్థం చేసుకొని మెలగండి. ఇంతే!" మధు తండ్రి పలికిన ఈ పలుకుల్ని మధూ చంద్రం ఉభయులూ తలలు వంచుకొని విన్నారు. ఏదో ఒక దివ్యకాంతి ఉభయుల అంతర్యాల్లోకి ప్రవేశించింది.

కేవలం వినోదార్థం ఒక కొన్ని పత్రికలు ఉండరాదని నేననను. కాని మన సాహిత్యానికి ఇవే శరణ్యములై ఉండడం చింతనీయము. ధరలో చవుకదనము తప్పుకాదు. ఆ చవుకదనము వాఙ్మయంలో వ్యాపిస్తేమాత్రం ప్రమాదమే. ఇటీవల కొన్ని పత్రికలలో ప్రచురింపబడే కథలలో, నాటికలలో ఉత్తమ సాహిత్య లక్షణం నానాటికీ తగ్గిపోతూన్నట్లు నాకు తోచినది. నూటిలో తొంభైతొమ్మిదింటికి శాశ్వతమైన విలువ పూర్తిగా లేదనుకొంటాను.—శ్రీ పి. వి. రాజమన్నార్